

సిపిఎం నుంచి కార్యకర్తల బహిష్కరణ

ప్రజాశక్తి -బద్వేలు

పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కార్యకర్తలు షేక్ ఖాదర్ బాషా, షేక్ మస్తాన్, స్వామిదాసులను పార్టీ నుంచి బహిష్కరించినట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్ తెలిపారు. బుధవారం స్థానిక సిపిఎం పట్టణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ నిబంధనవలకి విరుద్ధంగా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, పార్టీ పేరు చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడుతుండడంతో వారికి పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తూ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ జిల్లా కమిటీ నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పార్టీ అభిమానులు, శ్రేయోభిలాషులు గమనించాలని కోరారు. భవిష్యత్తులో వారికి, సిపిఎంకు సంబంధం లేదని తెలిపారు. వారు పార్టీ పేరు చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడితే పార్టీ బాధ్యత వహించదని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన

సిడిపిఓ కార్యాలయాల ఎదుట అంగన్వాడీల నిరసన - సిపిఎం, టిడిపి, కాంగ్రెస్, జనసేన ప్రజా సంఘాల మద్దతు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వైఎస్ఆర్ జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఓ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. సమస్యల పరిష్కారం అయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్టియులతో పాటు సిపిఎం, తెలుగుదేశం, కాంగ్రెస్, జనసేన పార్టీలు తమ సంపూర్ణ మద్దతు తెలియజేశాయి. వారి మద్దతుతో అంగన్వాడీల సమ్మె మరింత ఉధృత రూపం దాల్చుతోంది. కార్యకర్తలు, ఆయాలు ఎక్కడికక్కడ కార్యాలయాల ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.



కడప : నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు, నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

అంగన్వాడీ కార్యకర్తలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె కొనసాగిస్తామని అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి అన్నారు. అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా రెండవ రోజైన బుధవారం వేంపల్లె ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సిఐటియు, ఎఐటియుసి అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు బైఠాయించి నిరవధిక సమ్మె చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కన్నా అదనంగా రూ.1000 వేతనం ఇస్తామని జగన్‌మోహన్‌రెడ్డిరెడ్డి హామీ ఇచ్చారని మాటలు ఏమైనాయని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీని తక్షణమే అమలు చేయాలన్నారు. అలాగే మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఐసిడిఎస్ కు బడ్జెట్ కేటాయింపులు చేసి నిధులు పెంచి, ఫ్రీ స్కూల్ బలోపేతం చేయాలని చెప్పారు. అర్హులైన హెల్పర్స్‌కు ప్రమోషనుల నిబంధనలను రూపొందించి, ప్రమోషన్ల వయస్సు 50 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 2017 టిఎ, డిఎతో పాటు ఇతర బకాయిల బిల్లులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో చక్రాయపేట సిఐటియు యూనియన్ నాయకురాలు లలితామ్మ, సావిత్రి, లక్ష్మి, ఎఐటియుసి నాయకురాలు శైలాజ, సరస్వతి, ప్రభావతి, భాగ్యలక్ష్మి, శాంతకుమారి, శ్యామల, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **మైదుకూరు:** అంగన్వాడీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు నిరవధిక సమ్మెను చేపట్టారు. సిఐటియు నాయకులు ధనలక్ష్మి మాట్లాడుతూ మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ అంగన్వాడీ సెంటర్లగా మార్చాలని డిమాండ్ చేశారు. సమ్మెలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు గంగావతి, చెన్నమ్మ పాల్గొన్నారు. **దువ్వూరు :**మండల కేంద్రమైన స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు అంగన్వాడీ వర్కర్లు తమ డిమాండ్లను



ప్రొద్దుటూరు : తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



పులివెందుల : సమ్మెకు మద్దతు తెలుపుతున్న టిడిపి, కాంగ్రెస్ నాయకులు

పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. **పులివెందుల టౌన్ :** తెలంగాణ రాష్ట్రం మాదిరిగానే అంగన్వాడీలకు వేతనం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని అంగన్వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డి , తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శి సలీమా ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు. **ముద్దనూరు :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేసి పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని అంగన్వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్వాడీ కార్యకర్తలు బైఠాయించి నిరవధిక సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో ముద్దనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కార్యకర్తలు పాల్గొన్నారు. **చాపాడు :**అంగన్వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్యకర్తలు నిరవధిక సమ్మెను చేపట్టారు. ఈసందర్భగా తహశీల్దార్ యామినికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు అరుణ, ఝాన్సీ, అంజనమ్మ, వరలక్ష్మి, రామలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు. **బద్వేలు :** ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు



బద్వేలు : ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు మాట్లాడుతూ అంగన్వాడీ, మినీ అంగన్వాడీ, హెల్పర్స్ పేద ప్రజలకు ఆహారం, విద్య అందించడానికి అనేక రకాల సేవలు చేస్తున్నారని తెలిపారు. బద్వేల్ ప్రాజెక్టు పరిధిలో సాంకేతిక కారణాలవల్ల నిలిచిపోయిన అంగన్వాడీ వర్కర్స్ వేతనాలను చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న సీమంతపు బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సిఐటియు బద్వేల్ పట్టణ కో-కన్వీనర్ దియ్యాల హరి, బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కోశాధికారి కె.శివకుమార్, సంఘమిత్ర సొసైటీ అధ్యక్షులు సోద్దల పెంచలయ్య, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గంగనపల్లె నాగార్జున, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మైదుకూరు డివిజన్ కార్యదర్శి కొండయ్య మద్దతును తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కె.సుభాషిని ప్రధాన కార్యదర్శి ఆర్.హుస్సేనమ్మ, ప్రాజెక్టు నాయకులు సత్యవతి, కళావతి, విజయమ్మ, తులసమ్మ, వెంకట నరసమ్మ, వసంతమ్మ, శ్రీలత, లీలావతి, కళావతి, కృష్ణవేణి, ప్రవీణ, ఉమాదేవి, లక్ష్మీ నరసమ్మ, మహాలక్ష్మి ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** అంగన్వాడీల సమ్మె పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు మద్దతుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు బి.సుబ్బారెడ్డి, యుటిఎఫ్ నాయకులు చెన్నయ్య, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.



వేంపల్లె : మాట్లాడుతున్న అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మి దేవి

బ్రహ్మంగారిమఠం : అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సునీల్ కుమార్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు అనురాధ, మంజుల, అన్నపూర్ణ, శ్రీదేవి, లతా, ప్రభావతి ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కలివేల రాజశేఖర్, సిఐటియు నాయకులు భాస్కర్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** అంగన్వాడీలకు సిఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు, సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు బైఠాయించి నిరవధిక సమ్మె చేశారు. కార్యక్రమంలో సిఐటియు యూనియన్ నాయకులు భాగ్యమ్మ, లక్ష్మీదేవి, ఎఐటియుసి నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సిపిఐ రామయ్య, సుబ్బరాయుడు, విరసం వరలక్ష్మి, సృజన శ్రీనివాసులు, సిఐటియు నాయకులు విజయ్ కుమార్, సాల్మన్, అంగన్వాడీ యూనియన్ నాయకులు రాణమ్మ, మంజుల ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ముంతాజ్, యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, అధ్యక్షులు రాణి, సువార్తమ్మ, నాగలక్ష్మి, గీత, రాజి, సునీత, రామసుబ్బమ్మ రాజుపాలెం సెక్టర్లో నిర్మల, ఇందిరా, లక్ష్మీదేవి పాల్గొన్నారు. **కడప అర్బన్ :** అంగన్వాడీలకు సిఎం జగన్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అంగన్వాడీలో చేపట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు టిడిపి, జనసేన, సిపిఎం నాయకులు తెలిపారు. బుధవారం అర్బన్ ప్రాజెక్ట్ ఎదుట సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవిరెడ్డి, సిపిఎం జిల్లా, నగర కార్యదర్శులు జి.చంద్రశేఖర్, ఎ.రామమోహన్, సిఐటియు జిల్లా, నగర ప్రధాన కార్యదర్శులు మనోహర్, వెంకటసుబ్బయ్య, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి మాట్లాడారు. సమ్మెలో యూనియన్ నాయకులు అంజనీ దేవి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



ముద్దనూరు : నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

మున్సిపల్ కమిషనర్‌కు కార్మికులు సమ్మె నోటీసు

ప్రజాశక్తి-బద్వేలు

మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు జగన్ ఇచ్చిన హామీ మేరకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ 21 నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మె నిర్వహించాలని ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం సమ్మె నోటీసు అందించినట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి దియ్యాల నాగేంద్ర బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నగరాల సుందరీకరణ, అమృత పట్టణాలు, స్వచ్ఛభారత్ వంటి ఆకర్షణీయమైన పేర్లు పెట్టి కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నాయి తప్ప మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను గాలికొదిలేసతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్న వాగ్దానం అటకెక్కించారని పేర్కొన్నారు. సిపిఎస్ రద్దు, ఒపిఎస్ అమలు వాగ్దానానికి తూట్లు పొడిచారని, సరెండర్ లీవులు, డిఎ బకాయిల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సమస్యలు పరిష్కరించాలని పలుదపాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టనందున గత్యంతరం లేని పరిస్థితులలో డిసెంబర్ 21 నుంచి నిరవధిక సమ్మెకు వెళు న్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు పులి శ్యాం ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షులు దియ్యాల హరి, ప్రధాన కార్యదర్శి దియ్యాల నాగేంద్రబాబు, కోశాధికారి కాలువ శివకుమార్ పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ సంచాలకులుగా రామమోహన్

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

2024 జనవరిలో జరగనున్న అంతర్జాతీయ రెండవ తెలుగు మహాసభలకు ఉత్సవ కమిటీ సంచాలకులుగా పట్టణానికి చెందిన రచయిత బొల్లు రామమోహన్‌ను ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ నియమించారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో గోదావరి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరగనున్నాయన్నారు. 15 మందితో జిల్లా ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. తెలుగుజాతి సాహితి సాంస్కృతిక ఆత్మ గౌరవం ఆంధ్ర వైభవ స్వాభిమాన చిహ్నం ఆంధ్ర సారస్వత పరిషత్ సంస్థ ఆంధ్రమేవ జయతే అన్న నినాదంతో తెలుగు భాష వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే దిశగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పెద్ద ఎత్తున అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించాలని సంకల్పం చేసినట్లు తెలిపారు. ఆదికవి నన్నయ వేదికపై తెలుగు భాషలోని 25 ప్రక్రియలపై సదస్సులు, కవి నారాయణ బట్టు వేదికపై కవి సమ్మేళనంలో కవిత గేయం పద్యం హైకు నానీలు తెలుగు గజల్ తెలుగు రూపాయి కథా పట్టణాలకు అవకాశం కలిగిస్తున్నారని తెలిపారు. రాజనరేంద్ర వేదికపై హరికథ బుర్రకథ యక్షగానం అవధానం పౌరాణిక నాటకం, సాంఘిక నాటకం, వాగ్గేయకార సంగీతం, లలిత చలనచిత్ర జానపద సంగీతం ఆంధ్రనాట్యం కూచిపూడి నృత్యాలు సంచార జాతుల ప్రదర్శనలు ఏర్పాటు చేశారని తెలిపారు. పుస్తక ప్రదర్శనలు కేంద్ర సాహిత్య అకాడమీ నేషనల్ బుక్ ట్రస్ట్ విశాలాంధ్ర గ్రంథాల ప్రత్యేక ప్రదర్శన కూడా ఏర్పాటు చేస్తారని వివరించారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పోరుమామిళ్ల : ఈ నెల 18, 19వ తేదీలలో జరగనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎస్సీ హాస్టల్‌లో మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిస్కారం కోసం అలుపెరగని పోరాటాలు చేస్తామన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు అండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులను సంఘటితం చేస్తూ అనేక పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలను సొంతం చేసుకున్నామన్నారు. ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ విద్యారంగం బలోపేతం కోసం విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. మహాసభలను జయప్రదం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు ఎద్దు రాహుల్, సహాయ కార్యదర్శి వీరపోగు రవి, నాయకులు విజయ్ భాస్కర్, గుర్రప్ప సుబ్బయ్య పాల్గొన్నారు.

ఎన్నికల విధులను బాధ్యతగా చేపట్టాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - కడప

రానున్న సాధారణ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా, బాధ్యతగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు నోడల్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాలులో రానున్న సాధారణ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, సన్నద్ధతపై సంబందిత నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా రాబోయే సాధారణ ఎన్నికల సమయంలో నోడల్ అధికారులు చేపట్టాల్సిన కార్యకలాపాలను తెలియజేస్తూ వారికి కేటాయించిన విధులను బాధ్యతగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మ్యాన్ పవర్ నిర్వహణ, ట్రైనింగ్ మేనేజ్మెంట్ (శిక్షణ నిర్వహణ), మెటీరియల్ మేనేజ్‌మెంట్, ట్రాన్స్పోర్ట్ మేనేజ్మెంట్, కంప్యూ టరైజేషన్, సైబర్ సెక్యూరిటీస్, ఐటీ విభాగాల నిర్వహణ, ఎస్‌విఇఇపి, లా ఆర్డర్, ఇవిఎం సెక్యురిటీ ప్లాన్ నిర్వహణ, ఇవిఎం మేనేజ్మెంట్, ఎంసిసి నిర్వహణ, ఎక్స్ పెండెచర్ పర్యవేక్షణ, బ్యాలెట్ పేపర్స్, పోస్టల్ బ్యాలెట్స్, ఇటిపిబిఎస్ నిర్వహణ, మీడియా పర్యవేక్షణ, ఓటర్ల హెల్ప్ లైన్, ఫిర్యాదుల స్వీకరణ సంబందిత అంశాలపై సంబంధిత నోడల్ అధికారులకు వారు నిర్వహించాల్సిన విధుల గురించి పలు సూచనలు జారీచేశారు. నోడల్ ఆఫీసర్స్‌గా నియమితులైన వారందరూ వారివారి విధులను ఎలాంటి బాహ్య ప్రభావాలకు లోను కాకుండా చేపట్టాలన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ లోను, నాలుగు రెవెన్యూ డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా నియోజకవర్గ, మండల స్థాయిలో కూడా.. ప్రత్యేక కాల్ సెంటర్ సెటప్ ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రెస్ క్లిప్పింగ్స్ ఫైలింగ్, సోషల్ మీడియా, టెలివిజన్ మానిటరింగ్, సీసీ పుటేజీ రికార్డింగ్ మొదలైన మీడియా రిలేటెడ్ ప్రక్రియలను విధిగా చేపట్టాలన్నారు. నియోజకవర్గాల వారీగా ఉన్న సోషల్ మీడియా గ్రూపులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంతేకాకుండా ఎలాంటి రాజకీయ సంబంధిత అవాంఛిత సందేశాలను నియంత్రిం చాలన్నారు. జిల్లా ఎన్నికల నిర్వహణ యాజమాన్యం నియమ నిబంధనలను అనుసరించి తూచా తప్పకుండా ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. ఎబిఎల్‌ఒ పరిధిలో కూడా ఓటరు లిస్టులో చనిపోయిన వారి, డూప్లికేట్ ఓటర్లు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో జెసి గణేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ తుషార్ డూడీ, నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టరేట్‌లు కౌసర్‌భాను, ప్రత్యూషా, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకట రమణ, వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఒఎస్‌డి రఘునాథ్, సిపిఒ వెంకటరావు పాల్గొన్నారు.

చంద్రబాబు గెలుపే ధ్యేయం : టిడిపి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని రెండు నెలలుగా భారీ జన సమీకరణతో గడపగడపకు వెళ్లి మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఉన్నామని టిడిపి కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వివిఎస్ అమీర్ బాబు, సీనియర్ నాయకులు అలంకానపల్లె లక్ష్మిరెడ్డి, దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. మరో 22 డివిజన్లో ప్రచారం నిర్వహించాల్సి ఉందని చెప్పారు. బుధవారం అమీర్‌బాబు స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 10వ తేదీ లోపు కడప నియోజకవర్గంలో పూర్తిగా పర్యటిస్తామని చెప్పారు. టిడిపి మేనిఫెస్టో ప్రజలకు చేకూడ్చే లబ్ధిని తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. భారీ మెజారిటీతో తెలుగుదేశం పార్టీని గెలిపించుకుని నారా చంద్రబాబును ముఖ్యమంత్రి చేస్తామని పేర్కొన్నారు. 53 రోజులు చంద్రబాబు నాయుడును జైల్లో పెట్టించి సీఎం జగన్ మోహన్ రెడ్డి పైశాచిక ఆనందం పొందాలని విమర్శించారు. జగన్ మంచి పాలన అందిస్తారు అనుకుంటే రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ప్రజలు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు 13వ డివిజన్ ఇన్‌ఛార్జి బోగి రెడ్డి ఓబుల్ రెడ్డి, కడప నగర తెలుగు యువత అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, పల్లెసుధాకర్ రెడ్డి, 6వ డివిజన్ సీనియర్ నాయకులు మామిళ్ళ శివ, కడప నగర ఉపాధ్యక్షులు, 15వ డివిజన్ ఇంచార్జ్ కొండా సుబ్బయ్య, ప్రముఖ మత గురువు అబ్దుల్లా, కడప తెలుగు యువత నగర ప్రధాన కార్యదర్శి హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - కడప

జగన్ ప్రభుత్వంలోనే మహిళా సాధికారత జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి మంత్రివర్యులు ఎస్‌బి అంజాద్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక అగాడి వీధి 37వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ శ్రీవాని, ఇన్‌ఛార్జి బసవరాజు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనన్నే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజాద్‌బాష మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఇంకా అభివృద్ధి చెందాలంటే, మనందరి కుటుంబాలు బాగుపడాలంటే మళ్ళీ జగన్ ప్రభుత్వం రావాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలకు అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్స్ షేక్ మహమ్మద్ షఫీ, హరూన్ బాబు, అజ్మత్తుల్లా ఖాన్, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ సయ్యద్ ఇబ్రహీం మియా, వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ రిజ్వాన్, నాయకులు అఫ్జల్ ఖాన్, నరపు రెడ్డి సుబ్బారెడ్డి, సుబాన్ బాషా, అహ్మద్, సాయిపేట సీను, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం : మాధవి

ప్రజాశక్తి-కడప అర్బన్

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి కడప నియోజకవర్గ ఇన్చార్జి మాధవిరెడ్డి అన్నారు. బుధవారం 2వ డివిజన్ నాయకులు ఎద్దుల శంకర్ ఆధ్వర్యంలో టిడిపి, జనసేన పార్టీ తరపున బాబు షఉరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని, బాబు షఉరిటీ భవిష్యత్తు గ్యారంటీ అనే పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందరేగా మాధవి రెడ్డి, సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి నాలుగున్నర సంవత్సర పరిపాలన కాలంలో అభివృద్ధి శూన్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు తోనే సాధ్యమన్నారు. టిడిపి, జనసేన నాయకుల పైన అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. టిడిపి జనసేన నాయకుల పైన దాడులు చేస్తే సహించమని హెచ్చరించారు. అధికార అహంతో ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. టిడిపి నాయకుల ఆత్మస్థైర్యాన్ని భయభ్రాంతులకు గురి చేసేలా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారని చెప్పారు. జనసేన, టిడిపి పొత్తుతో రాష్ట్రంలో విజయ డంకా మోగిస్తామని తెలిపారు. కడప నగరంలో ఎక్కడ అభివృద్ధి లేదని విమర్శించారు.కార్యక్రమంలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, నాయకులు గోవర్ధన్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వికాష్ హరికృష్ణ

'ఇన్‌ఛార్జులను మారిస్తే ప్రజాభిప్రాయం మారుతుందా?'

ప్రజాశక్తి - కడప

ప్రజలు ప్రభుత్వాన్ని మార్చాలి అనే నిర్ణయించినప్పుడు నియోజకవర్గ ఇన్‌ఛార్జులను మారిస్తే ప్రజాభిప్రాయం మారుతుందా? అని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు జిలానిబాష అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 11 మందికి స్థానాచలం చేస్తూ 70 నియోజకవర్గ ఇన్‌ఛార్జులను మార్చడం అవివేకమన్నారు. ప్రజాభిప్రాయం మారదని, ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారన్నారు. రాష్ట్రంలో ఉండే ఐదు కోట్ల మంది ప్రజలు 2024లో చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోకుండా, సొంత ప్రయోజనాలతో దోచుకోవడం దాచుకోవడం పంచుకోవడం ఎజెండాతో ప్రభుత్వం పరిపాలన సాగించిందన్నారు. ఈ నాలుగున్నర సంవత్సరంలో ఏ వర్గపు యొక్క ప్రజలు సంతోషంగా లేరని, ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు నిరుద్యోగులు వలసలు వెళుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగస్తులు జీతాల కోసం ఎదురు చూసే దుస్థితి నెలకొన్నదని ఇది ప్రజా ప్రభుత్వం కాదు పన్నుల ప్రభుత్వమని తెలియజేశారు. వైయస్సార్ ప్రభుత్వ విధి విధానాలతో ప్రజలు విసిగిపోయారని 175 నియోజకవర్గ ఇన్చార్జిలను మార్చిన, ఆంధ్రప్రజలు తెలుగు దేశానికి పట్టం కడతారన్నారు. 2024లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని తెలిపారు. సమావేశంలో 22 డివిజన్ ఇంచార్జ్ శ్రీనివాసులు, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, అనిల్ పాల్గొన్నారు.

పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలి

ప్రజాశక్తి - కడప

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎస్సీలకు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు గురించి వివరిస్తూ ప్రజలకు తెలియజేయాలని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం కడపలోని వైసిపి జిల్లా కార్యాలయంలో కమలాపురం నియోజకవర్గానికి సంబంధించి ఎస్సీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజల్లోకి వెళ్లి వివరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ పులి సునీల్ కుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వినోద్ కుమార్, నాయకులు కిషోర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఫిర్యాదుల విచారణ

ప్రజాశక్తి - కడప

ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధుల నుండి అందిన ఫిర్యాదుల విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపడుతున్నామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనలు పాటించి నిబంధనల మేరకు క్లెయిమ్స్ పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఫామ్-6కు సంబంధించి మొత్తం 46,732 దరఖాస్తులు రాగా, 28,361 క్లెయిమ్స్ ఆమోదించగా, 2,771 క్లెయిమ్స్ రిజెక్ట్ చేయడం జరిగిందని, 15,596 క్లెయిమ్స్ పెండింగ్ ఉన్నాయని, ఫిర్యాదులను విచారణ చేయడం జరుగుతుందని, వాటిని పరిశీలన చేసి త్వరగా పరిష్కరిస్తామన్నారు. ఫిర్యాదులను 26వ తేదీలోపు విచారణ చేసి పరిష్కరించి జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు.


డాక్టర్ కె.శేష మహేశ్వరమ్మను సన్మానిస్తున్న విసి రంగ జనార్ధన్

శేష మహేశ్వరమ్మకు బెస్ట్ టీచర్ అవార్డు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జెఎన్‌టియు (పులివెందుల) అధ్యాపకురాలు డాక్టర్ కె.శేష మహేశ్వరమ్మ బుధవారం ఆ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రంగ జనార్ధన్ చేతుల మీదుగా బుధవారం బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు. యూనివర్శిటీలో కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.సూర్య నారాయణరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

పంపిణీకి నోచని చెత్తబుట్టలు

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలో 23 పంచాయతీలకు సంబంధించి చెత్త సేకరణ కోసం ప్రతి ఇంటికి రెండేసి ప్రకారం బుట్టలు మంజూరు చేశారు. అయితే నెల రోజు ల క్రితం ముందుగా దువ్వూరుకు చేరుకున్నాయి. అక్కడినుండి గ్రామ సచి వాలయాలకు చేరవేశారు. ఇప్పటికే దాదాపు నెలరోజులు అవుతున్నా పంపిణీకి నోచుకోలేదు. ఇవి సచివాలయాల్లో మూలన పడేశారు. ఏ ఒక్క సచివాలయంలో కూడా పంపిణీకి అధికారులు చర్యలు తీసుకోలేదు. గత ప్రభుత్వంలో ఇలాగే చెత్తబుట్టలు రాగా మండలంలో కొందరు సర్పంచ్‌లు ఇళ్లల్లో వేసుకొని ప్రజలకు ఇవ్వలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు కూడా గతంలోలాగా నాయకుల ఇళ్లల్లోకి వెళతాయనే అపోహలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తబుట్టలను ప్రతి ఇంటికి అందజేయాలని పలువురు సూచిస్తున్నారు.




కుప్పాలపల్లిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

రైతుల ఆక్రందన పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి - వేంపల్లె

అక్రమ కేసులు, కక్ష సాధింపు చర్యలు తప్ప కరువుతో అల్లాడుతున్న రైతులను వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కుప్పాలపల్లి గ్రామంలో బుధవారం టిడిపి నాయకులు చాపాటి రామిరెడ్డి, రామగంగిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ తిరిగి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలు గురించి ప్రజలకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే వ్యతిరేక విధానాలతో ప్రజలు చాలా నష్టపోతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, వెల్డింగ్ బాషా, మడక రమేష్, మహమ్మద్ ఇనాయతుల్లా, డక్కా రమేష్, సయ్యద్ పీరా సాహెబ్, జయచంద్రారెడ్డి, గోగుల మల్లికార్జున, ఈశ్వరయ్య, పలువురునాయకులు పాల్గొన్నారు.


తిప్పిరెడ్డిపల్లె వద్ద వేస్తున్న సిసి రోడ్డు

వేగవంతంగా నక్కలదిన్నె-వెదురూరు రోడ్డు పనులు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని నక్కలదిన్నె-వెదురూరు రహదారిని వేగవంతంగా నిర్మాణం చేపట్టారు. రూ.2.30 కోట్లతో 5 గ్రామాలకు సిమెంట్, తార రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఆర్అండ్‌బి ఎఇ దాదాబాషా తెలిపారు. అనంతపురం బ్రిడ్జి వద్ద, తిప్పిరెడ్డిపల్లె వద్ద సిమెంటు రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఓ వైపు నిర్మాణం జరుగుతుందన్నారు. గత వేసవిలో చాపాడు నుంచి నక్కలదిన్నె వరకు ఆర్అండ్‌బి రోడ్డును నిర్మించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం గ్రామాల వద్ద సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేసి తార రోడ్డును ఏర్పాటు చేపడతామన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే చాపాడు నుండి వెదురూరుకు ప్రయాణం సులభతరం అవుతుంది.

నేడు 'డయల్ యువర్ డిఎం'

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ఆర్‌టిసి డిపో కార్యాలయంలో గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిఎం రామకృష్ణ తెలిపారు. ప్రయాణికులు ఏవైనా సూచించాలనుకుంటే 99592 25780కు ఫోన్ చేయాలని ఆయన కోరారు. వాట్సాప్ ద్వారానైనా ఆ నెంబర్‌కే తమ సమస్యలను తెలపవచ్చన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఎం కోరారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక కడప రోడ్డు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పివి రమణయ్య (56) అనే ఉపాధ్యాయుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలి పారు. వారు తెలిపిన మేరకు వివ రాలు.. మృతుడు పెద్ద ముడియం మండలంలో జె. కొట్టాల పల్లి ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యా యుడిగా విధులు నిర్వహిస్తున్నారు. సొంత పనిపై వెళ్లి వస్తుండగా బైకు అదుపుతప్పి కిందపడింది. వెనకాలే వస్తున్న ట్రాక్టర్ టైర్ కడుపుపై పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రమణయ్య సొంత గ్రామం లింగాల మండలంలో లోపట్నూతల. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. రమణయ్య భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన రమణయ్య

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

దేశవ్యాప్తంగా గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె బుధవారానికి రెండోరోజుకు చేరుకుంది. స్థానిక తపాలాశాఖ ప్రధాన కార్యాలయం వద్ద ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షుడు రాముడు ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమిటీలో అమలుకాని అన్ని అంశాలను అమలు చేయాలన్నారు. టార్గెట్, మేళాల రూపంలో జిడిఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని రకాల వేధింపులను ఆపేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ పరిధిలోని అన్ని తపాల శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న సిబ్బంది

జగనన్న శాశ్వత భూ హక్కుపై రీ సర్వే


ట్యాబ్ అందిస్తున్న కమిషనర్ నరసింహారెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష పథకంలో భాగంగా పులివెందుల మున్సిపాలిటీలో ఇదివరకే డ్రోన్ ఫ్లై చేసి ఉన్నారని పులివెందుల మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ సభా భవనంలో జగనన్న భూ హక్కు- భూరక్ష పథకంలో భాగంగా రీ సర్వేలో ముఖ్యమైన ప్రక్రియలు ఆర్క్-జిఐఎస్, వెక్టరైజేషన్, ఎల్పీఎం, పిపిఎం తయారు చేయుటలో వార్డ్ అడ్మిన్, ప్లానింగ్ సెక్రటరీలకు విజయవాడ సిడిఎంఏ ఆఫీస్ నుంచి వచ్చిన జిఐఎస్ ఎక్స్‌పర్ట్స్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు రీ సర్వే చేయుటకు ఉపయోగించే ట్యాబ్‌లను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి మునికుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, మునిసిపల్ ఆర్ఐ రఘునాథ రెడ్డి, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

కంటి జాగ్రత్తలు తీసుకోవాలి : జడ్‌పిటిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కంటి పట్ల విద్యార్థులతోపాటు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం వైఎస్ఆర్ కంటి వెలుగు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మాట్లాడుతూ కంటిచూపు లేకపోతే జీవితం అంధకారమన్నారు. ప్రతి విద్యార్థి కంటి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కంటి సమస్యలు కొద్దిగా ఉన్నప్పుడే డాక్టర్లను సంప్రదించాలని కోరారు. జగన్ ప్రభుత్వం విద్య, వైద్యంపట్ల ప్రత్యేకశ్రద్ధ పెట్టిందన్నారు. ఇందులో భాగంగానే వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం అని తెలిపారు. విద్యార్థులు, వృద్ధులకు కూడ కంటి పరీక్షలు చేసి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు స్వాతిసాయి, కంటి వైద్యులు రెడ్డన్న, కమ్యూనిటీ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ వెంకటరత్నం, ఫకృద్దీన్, ప్రధానోపాధాయయురాలు శివ మునెమ్మ, బాలికల పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కంటి అద్దాల పంపిణీలో జడ్‌పిటిసి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది

ముంపువాసుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా..?


బహిరంగ సభలో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - కొండాపురం

ప్రజల సమస్యలు, ముఖ్యంగా గండికోట ముంపువాసుల సమస్యలు నేటి పాలకులకు పట్టవా అని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి ప్రశ్నించారు. గండికోట ముంపు వాసుల సమస్యలు తెలుసుకోవడానికి ఆయన బుధవారం మండలంలోని ఎర్రగుడి గ్రామం నుండి కొండాపురం వరకు దాదాపుగా 21 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. అనంతరం సాయంత్రం కొండాపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ గండికోట ప్రాజెక్టు వల్ల ప్రజల జీవితాలు మెరుగవుతాయని భావించారని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం కొండాపురం మండల ప్రజలు భూములు, ఇళ్లు త్యాగం చేశారన్నారు. ఎలాంటి ఆటంకం కలగకుండా సహాయపడ్డారని తెలిపారు. ముంపు వాసులకు చంద్రబాబు ప్రభుత్వంలో పునరావాస పరిహారం కింద రూ.6.75 లక్షలు పంపిణీ చేశారు. అనంతరం 2019 ఎన్నికల సందర్భంగా వైసిపి దానికి అదనంగా మరో మూడు లక్షల 25 వేల రూపాయలు ఇస్తామని చెప్పి, ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక తాళ్ల ప్రొద్దుటూరు, ఎర్రగుడి, చామలూరు గ్రామాలను ఉన్నఫళంగా ఖాళీ చేయించారే కానీ.. వారి జీవన విధానం, పరిహారం చెల్లింపు, కనీస వసతుల కల్పన వంటికి నేటి పాలకులు పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ఇప్పటివరకు పునరావస కాలనీలో రోడ్లు, డ్రయినేజీలు, నీటి సరఫరా, చివరికి శ్మశాన వాటికల ఏర్పాటు కూడా చేయలేదని వైసిపి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేపై విమర్శలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో మట్టి, ఇసుక అమ్మకాలు ఎక్కువైపోయాయన్నారు. కాంట్రాక్టర్ల వద్ద నుండి కమీషన్లు తీసుకోవడం వల్ల అభివృద్ధి కుంటుపడిందని భూపేష్‌రెడ్డి ఆరోపించారు. రాబోయే 2024 ఎన్నికల్లో జమ్మలమడుగు ఎమ్మెల్యేగా తనను, ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపిస్తే ముంపువాసుల సమస్యలు ఆరునెలల్లోపు పరిష్కరిస్తామని భూపేష్‌రెడ్డి తెలిపారు. అంతేకాక ఆరు గ్యారెంటీలను కూడా అమలు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెన్నా నది ఒడ్డున ఉన్న 10 గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఆ నదిపై లోలెవల్ బ్రిడ్జి శంకుస్థాపన చేస్తే దాని నిర్మాణం ఇప్పటివరకు పూర్తి చేయకపోవడం ప్రభుత్వం వైఫల్యమని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, టిడిపి నియోజకవర్గ పరిశీలకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

15 నుంచి నెల్లూరులో పిడిఎస్‌యు మహాసభలు



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బిఎస్ రమణారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఈనెల 15వ తేదీ నుంచి మూడు రోజులపాటు నెల్లూరులో జరిగే పిడిఎస్‌యు 23వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రయివేటు పాఠశాలల జిల్లా అధ్యక్షుడు బిఎస్ రమణారెడ్డి కోరారు. స్థానిక ఉషాకిరణ్ పాఠశాలలో బుధవారం మహాసభల పోస్టర్లను రమణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడియస్‌యు విద్యార్థి సంఘం అనేక విద్యార్థి, యువజన, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేసినట్లు చెప్పారు. ఈ మహాసభలకు విద్యార్థులు, మేధావి వర్గాలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, న్యాయవాదులు, వైద్యులతోపాటు అయా వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 పేరుతో విద్యా రంగాన్ని కాషాయీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దోపిడీలేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిడియస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, ఉషాకిరణ్ పాఠశాల ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భార్యను ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ఎ1గా ఉన్న భర్త జక్కి ప్రసాద్(30)కు యావ జ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.1,50,000 జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరు సెకండ్ ఎడిజె కోర్టు న్యాయమూర్తి జి.యస్.రమేష్‌కుమార్ బుధవారం తీర్పునిచ్చారు. కేసు వివరాలిలా ఉన్నాయి.. పెనగలూరు మండలం కొత్తపల్లికు చెందిన మృతురాలు రాజరాజేశ్వరి (21)కి 2010లో పెనగలూరు మండలానికి చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిపించారు. భర్త తాగుడుకు బానిస కావడంతో పెద్దమనుషుల సమక్షంలో విడాకులు తీసుకున్నారు. కొద్దికాలం అనంతరం రాజరాజేశ్వరి ప్రొద్దుటూరు పట్టణం ఆదర్శకాలనీలోని తన అవ్వ ఇంటికి వెళ్లిన సమయంలో జక్కి ప్రసాద్‌తో పరిచయం పెంచుకొని ఇష్టపడ్డారు. ఇరువైపులా పెద్దలు నిశ్చితార్థం చేసి, కట్నం కింద ఐదు తులాల బంగారు, బంగారు చైన్, ఉంగరం, బ్రాస్‌లెట్ ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం మేరకు ఇరువురికి 2016 మే 22న పెంచల కోనలో వివాహం జరిపించారు. వేధింపులు తాళలేక 2016 జులై7న సాయంత్రం ఇంటిలోకి వెళ్లి ఉరివేసుకుని మరణించినట్లు తల్లి మామడూరు వెంకటనరసమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు టూటౌన్ ఎస్ఐ మంజునాథరెడ్డి కేసు నమోదు చేశారు. అప్పటి జమ్మలమడుగు డిఎస్‌పి టి.సర్కార్ (ప్రస్తుతం కర్నూల్ అదనపు ఎస్పీ) సాక్షులను విచారించారు. అప్పట్లో ప్రొద్దుటూరు డిఎస్పీగా విధుల్లో ఉన్న నీలం పూజిత (ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కర్నూల్) ముద్దాయిలను అరెస్ట్ చేశారు. అనంతరం అప్పటి డిఎస్పీ కొల్లి శ్రీనివాసరావు (ప్రస్తుతం గుంటూరు) చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత టూటౌన్ సిఐ జి.ఇబ్రహీం కేసును పర్యవేక్షిస్తున్నారు. సాక్షాధారాలతో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని ఎస్‌పి సిద్ధార్థకౌశల్ అభినందించారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండల పరిధిలోని తాళ్లమాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయాలని ఉపవిద్యాశాఖాధికారి కృష్ణప్ప సూచించారు. ఆ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం, జగనన్న గోరుముద్ద నిల్వలను పరిశీలించారు. లెసన్ ప్లాన్, డైరీలు పరిశీలించారు. ఉపాధ్యాయుల సమావేశంలో పాఠశాల చాలా బాగుందన్నారు. విద్యార్థుల స్థాయిని కూడా మెచ్చుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చక్కగా చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపినాథరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల సమావేశంలో ఉప విద్యాశాఖాధికారి కృష్ణప్ప


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి టి.లక్ష్మయ్య

అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి : ఎంపిపి

ప్రజాశక్తి - చాపాడు

వైసిపి హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి ద్వారా లబ్ధి చేకూరుందని ఎంపిపి టి.లక్ష్మయ్య తెలిపారు. మండలంలోని వెదురూరు సచివాలయ పరిధిలో రూ.25.10 కోట్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని బుధవారం వెదురూరు సచివాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపిని ఆదరించాలని ఆయన కోరారు. ప్రభుత్వం చేపట్టిన మంచిని ప్రజలకు వివరించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్, ఎంపిటిసి శివ, మాజీ ఎంపిటిసి యల్లారెడ్డి, నాయకులు వీరారెడ్డి, శివారెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


లబ్ధిదారుల జాబితాను ప్రదర్శిస్తున్న నాయకులు, అధికారులు

రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ ఆయననే గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అగ్రహారం సహకార సంఘం అధ్యక్షులు రాఘవరెడ్డి, ఆ పార్టీ మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని రావులపల్లె సచివాలయం పరిధిలో బుధవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరామిరెడ్డి, దుంపలగట్టు గ్రామ సర్పంచ్ రెడ్యం రామకృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్ గోపాలరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కనపర్తి సుబ్బారెడ్డి, తవ్వా కిషోర్‌కుమార్‌రెడ్డి, మిడుతూరు చంద్ర, అధికారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైసిపి నాయకులు

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైసిపి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. చెన్నారెడ్డి కాలనీ సచివాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి కాలనీలో కిషోర్, కౌన్సిలర్ షాహిదా, వైసిపి నాయకుడు సిద్ధయ్య, గత ప్రభుత్వంలో చంద్రబాబు చేసిన మోసాలను చదివి వివరించారు. ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వంలో లబ్ధి పొందిన వివరాలను కూడా తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జెసిఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి, కౌన్సిలర్లు ఖాదర్, కో-ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, మస్తాన్‌వలి, ఉస్మాన్, ఓబులేసు, గంగిరెడ్డి, నాగరాజు, సుభాష్, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ

17న రైతుసేవా సమితి మొదటి జిల్లా మహాసభ

ప్రజాశక్తి-మైదుకూరు

ఈ నెల 17న మైదుకూరులో మొదటి రైతు సేవా సమితి మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సమితి అధ్యక్షులు ఎవి రమణ తెలిపారు. స్థానికంగా బుధవారం సమితి ముఖ్య నాయకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఏడాదిగా ఏ రాజకీయ పార్టీకి అనుబంధం లేకుండా స్వతంత్రంగా రైతు సేవా సమితి పేరుతో జిల్లాలో రైతు సమస్యలు, ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి మహాసభను రైతులు, రైతు శ్రేయోభిలాషులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సమితి మైదుకూరు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, సహదేవుడు, పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు రామ్మోహన్, శ్రీనివాసులు, సభ్యులు కత్తి నాగిరెడ్డి, రాజా, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో గ్రావెల్ రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - కొండాపురం

గండికోట ప్రాజెక్టులో ముంపునకు గురైన మండలంలోని చామలూరు పునరావాస కాలనీలో బుధవారం గ్రావెల్ రోడ్డు వేశారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారంతో రూ.20 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని స్థానిక సర్పంచ్ గురజాల రాఘ వీరేంద్రరెడ్డి పూర్తి చేశారు. పది రోజుల్లో రోడ్డు పూర్తి కావడంతో స్థానికులు సర్పంచ్‌ను అభినందించారు.

అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించాలి

వేంపల్లె : అవినీతి నిర్మూలనపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ జిల్లా ఇన్‌ఛార్జి గూడూరు రామచంద్ర పేర్కొన్నారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని డిఆర్ఓ గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎసిబి అధికారుల పేర్లు ఏర్పాటు చేయడంతోపాటు ప్రజలకు అవినీతిపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకొని ఉద్యోగ సర్వీస్ నుండి తొలగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రామలక్ష్మమ్మ, లక్ష్మి నారాయణరెడ్డి, కొండయ్య, రవికుమార్ పాల్గొన్నారు.